# ఆమె

గుజ్జుల వెంకట కృష్ణారెడ్డి



చీకటి ముసురుతోంది. సన్నని తుంపరగా మొదలైంది వర్షం. డాబాపై లాన్‌లో పచార్లు చేస్తున్న ప్రవీణ అందాలు అంచెలంచెలుగా తడుస్తున్నాయి. అదుపు లేని ఆమె మనోభావాలు తోడు కోరుకుంటున్నాయి. ఒంటరితనం భరించడం దుస్సాధ్యమనిపిస్తోంది. అంతకన్నా పెద్ద శిక్ష ఈ లోకంలో ఉందా ...? నిరీక్షణలో నిరాకారమైన ఆలోచనల వెల్లువ ప్రవీణలో పెల్లుబుకుతోంది.

తన కంపెనీలో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్న సునంద్‌ను ఆ రోజు ఇంటికి ఆహ్వానించింది. "కమ్ ఫర్ ఎ వెరీ ఇంపార్టెంట్ మీటింగ్ ఎట్ మై ప్లేస్!" అని పొద్దున్న ఫోన్‌లో సమన్స్ జారీ చేసింది.

ఆలస్యానికి కారణం తెలియక ఆమె ఆలోచనా పరిధి విభిన్నతీరాలను తాకుతోంది.

వెన్నెల కాంతిలో ... ఆమె మేని ఛాయ మిలమిలా మెరుస్తోంది. ముంగురులలో చిక్కిన నీటి బిందువులు ముత్యాల్లా తళుక్కుమంటున్నాయి.

అలజడి రేపే వాగులో ... హంపీ శిల్పకళా ప్రతిమలా ... సునంద్ రాకకై వేచి ఉన్నది.

ఆ క్షణం స్మృతిపథంలోకి జారకుంది. జ్ఞాపకాల జలపాతం కళ్లముందు మెదులుతోంది.

000

జమీందారీ వంశంలో పుట్టింది తను. అవసరానికి మించి గారాబం చేశారు ఆమె తల్లిదండ్రులు. అమెరికాలో ఎం.బి.ఏ. కోర్సు పూర్తి చేసి మాతృదేశానికి తిరిగి వచ్చింది.

అందగత్తెకు తోడు ఫారిన్ రిటర్న్‌డ్ బిరుదు తగిలించుకున్న ప్రవీణకు వంశపారంపర్యంగా వచ్చిన శ్రీమి, హుందాతనానికి కాస్త అహంకారం తోడయింది.

పెద్దలు చేసిన పెళ్లి ప్రయత్నాలకు విముఖత ప్రదర్శించింది. ఓ శుభముహూర్తాన తన మనోభీష్టాన్ని వెలిబుచ్చింది. విదేశంలో ఉన్నప్పుడు ఆనంద్‌తో తన పరిచయం గురించి చెప్పి మరో వ్యక్తిని మనువాడటానికి నిరాకరించింది.

ఆనంద్, ప్రవీణ్‌ల ప్రేమ వ్యవహారం గురించి తెలిసినవారికి వింతగానూ, కాస్త విడ్డూరంగానూ అనిపించేది. అందరిలాగా వాళ్లు క్లబ్బులు, హోటళ్లు, పార్కులచుట్టూ తిరిగేవారు కాదు. కాలేజీ క్లాస్‌రూమ్స్‌లో ఎదురుపడినప్పుడు క్రీగంటతో హుందాగా, ఆనంద్‌వంక చూడటం ప్రవీణవంతు.

అతనేమో ... ఆ చూపుల వేడి భరించలేనంటూ దీనంగా చూసేవాడు.

స్వదేశానికి తిరుగుముఖం పట్టినప్పుడు ఇద్దరూ ఒకే ఫ్లైట్‌లో రావడంతో వాళ్ల మధ్య చనువు పెరిగింది.

స్వాభావికంగా ఆనంద్ నెమ్మదస్తుడు విదేశాలకు వెళ్లినా ... స్వదేశీ సాంప్రదాయాన్ని గౌరవించే మనస్తత్వం. అతని తల్లిదండ్రులు పెద్ద స్థితిపరులు కాకపోయినా, వాళ్ల ఏకైక సంతానం ఆనంద్‌కు ఏ లోటూ లేకుండా పెంచారు.

ఫ్లయిట్ దిగి టారమ్యాక్‌పై నడిచేటప్పుడు ప్రవీణ కళ్లల్లోకి సూటిగా చూడకుండా "ఐ లవ్ యు!" అన్నాడు ఆనంద్.

దర్పంగా చిరునవ్వు విసిరి, "ఆ మాట చెప్పడానికి ఎందుకంత టెన్షన్?" అంటూ అతడి గడ్డాన్ని ఎత్తి కళ్లలో కళ్లు కలిపింది.

కాసేపటికి, మాటల తర్వాత ఇద్దరూ విజిటింగ్ కార్డులు ఎక్స్‌ఛేంజ్ చేసుకున్నారు.

విషయం తెలిసిన ప్రవీణ తల్లిదండ్రులు, ఆనంద్ తల్లిదండ్రులను, పెళ్లికి కొంచెం కష్టంగానే ఒప్పించారు. గొప్పింటి సంబంధం చేసుకోవడం అయిష్టంగా ఉన్నా, ఆనంద్ తండ్రికి ఒప్పుకోక తప్పలేదు.

ప్రవీణ్, ఆనంద్‌ల పరిణయ మహోత్సవం చాలా ఆర్భాటంగా జరిగింది. కళ్యాణవేడుక తదుపరి కార్యక్రమం, తొలిరేయి వేడుకను ప్రవీణ కోరిక మేరకు మామిడి తోట మధ్య ఉన్న అద్దాల మేడలో ఏర్పాటు చేశారు. అది ఒకప్పటి ఆమె తాతగారి రాసకేళి గృహం.

ఆ గదికి శృంగారం కొత్తేమీ కాదు. ఎన్నో శృంగార విలాసాలు, విలాపాలు జరిగాయక్కడ. గదిలోని రసలాలసవేదికను అలంకరించిన కుసుమ గుచ్ఛాల సువాసన గదినిండా వ్యాపించి చుట్టూ వాతావరణాన్ని మత్తెక్కిస్తుంది.

నీలిమేఘాల మధ్య దోబూచులాడే చందమామ, అచ్చోట జరిగే కార్యక్రమానికి ప్రత్యక్షసాక్షిగా వ్యవహరించబోతున్నాడు.

గదిలో వేచి ఉన్న ఆనంద్‌కు అల్లంత దూరాన ఆమె చెలియల రసిక సంభాషణల అలికిడి ఇంపుగానూ, కవ్వింపుగానూ వినిపించడంతో తన హృదయరాణి రాకను గమనించాడు.

శృంగార దేవతవోలె గదిలోకడుగుపెట్టింది ప్రవీణ. మరుక్షణం గడియ మూసుకున్న శబ్దం. ఇరువురి గుండెల్లో నిశ్శబ్దం. మెల్లగా ముందుకు కదిలి ఓ లేత గులాబీని ఆమె అధరాలపై సుతారంగా కదిలించాడు. ప్రవీణ సిగ్గుతో పులకించిపోయింది.

ఎంతటి అహంకారికైనా ఆ సమయాన తగని సిగ్గే సహజం.

ఆమె అధరావృత చారికలు పులుముకున్న గులాబితో ... ఏవో గుసగుసలు చెప్పి ప్రవీణ తలలో తురిమాడు.

క్షీరసాగరమధనానికి ముందు ఇరువురూ క్షీరం సేవించారు.

వెన్నెల సాక్షిగా మామిడాకుల వింజామరల హాయికి ఆలింగనంలో ఆనందం చవిచూస్తున్నారు. ఆ రేయి గడిచింది.

మొద్దు నిదురలు లేపే మొనగాడు తూర్పునుండి దూసుకొస్తున్నాడు. ఉదయభానుడి లేత కిరణాల తాకిడికి, ఇద్దరి శరీరాల్లో కదలిక మొదలైంది.

భారంగా వాలుతు కళ్ళు బాహ్యప్రపంచాన్ని వింతగా చూస్తున్నాయి. ఆరుబయట వెన్నెల్లో అన్ని పక్కలా ఓపెన్‌గా ఉన్న ఆ అద్దాల మేడలో ఆ రాత్రి ఎంత ఘనంగా జరిగిందో అర్థమవుతోంది ఆనంద్‌కి. ఏం చేయగలడు? ప్రవీణ మనసు గ్రహించి, తన మనసుకు సర్ది చెప్పుకున్నాడు. అదో వెరైటీలెమ్మని!

తొలి రేయి వేడుక అంత వెరైటీగా జరగడం, ప్రవీణ కుటుంబ సభ్యులకు ఇష్టం లేకపోయినా, ఆమె మొండితనం వల్ల అలా ఏర్పాటు చేయక తప్పలేదు.

ప్రతి పనిలో వెరైటీ వెతికే స్వభావం ప్రవీణదైతే, సర్దుకుపోయే మనస్తత్వం ఆనంద్‌ది.

ఈ ముచ్చట్ల తర్వాత కొన్ని రోజులకు బిజినెస్ వ్యవహారాల నిమిత్తం కలకత్తాలో సెటిలయ్యారు. అత్తవారింట్లో అడుగుపెట్టిన కొత్తకోడలికి సకల మర్యాదలూ జరుగుతున్నాయి. కొద్దికాలంలో లేడీస్ క్లబ్ సెక్రటరీగా హోదా కైవశం చేసుకుని, క్లబ్బు వ్యవహారాలలో బిజీ అయింది. సమయాన్ని సోషల్ మూవ్‌మెంట్స్‌లో గడిపేస్తుంది.

కష్టపడి నెలకొల్పిన పరిశ్రమ అభివృద్ధి చేయడంలో తలమునకలవుతున్నాడు ఆనంద్. బిజినెస్ విషయాలు చూసుకోమని చాలాసార్లు రిక్వెస్ట్ చేసినా, "ఐ యామ్ సారీ, డియర్! బిజీ విత్ క్లబ్ అఫైర్స్, నో టైమ్!" అని సరిపెట్టేది ప్రవీణ.

బలవంతపెట్టడం ఇష్టంలేక ఊరుకున్నాడు ఆనంద్.

'సంతానమంటే సరదాలకు ఆనకట్ట కట్టడమే!' అని అనుకునే ప్రవీణ ఆ విషయంలో అభిరుచి కనబరచలేదు. ఈ స్వభావమే, ఆమె అత్తమామల్ని కలవరపరిచింది.

కాలగర్భంలో రెండేళ్లు కలిసిపోయాయి. తన చుట్టూ ఎన్నో సంఘటనలు, వింతలు, విడ్డూరాలూ జరిగినా ఏమీ పట్టనట్టు కనికరం లేని కాలచక్రం జనవాహినిని నలిపేస్తూ నంగనాచిలా ముందుకు దూసుకెళ్లింది.

ఆ రెండేళ్ల కాలంలో దెబ్బమీద దెబ్బ తిన్నాడు ఆనంద్. తలవని తలంపుగా తండ్రి పక్షవాతానికి గురయ్యాడు. ఆర్థికంగా ఇబ్బందులు.

## నిద్రాప్రియుల కొక హెచ్చరిక

ఎక్కువసేపు నిద్రపోతే ఆరోగ్యంగా ఉండగలమని మనలో చాలామంది అనుకుంటూంటారు. రోజుకు ఎనిమిది గంటలకుపైగా నిద్రపోయేవాళ్లు ప్రశాంతంగా, నిగనిగలాడే శరీరంతో కనిపించవచ్చు. కాని, అటువంటివాళ్లు గుండెపోటుకు గురయ్యే అవకాశ మెక్కువని పరిశోధకులు అంటున్నారు. పది సంవత్సరాలపాటు ఏడువేలమంది వయోజనులపై పరిశోధనలు చేసిన శాస్త్రవేత్తలు ఎనిమిది గంటలకుమించి నిద్రపోయేవారిలో స్లీప్ అప్నియా అనే వ్యాధివలన కొవ్వు పెరిగి గుండెపోట్లు రావడానికి అవకాశ మెక్కువని తేల్చారు. నిద్రాప్రియులూ, జాగ్రత్త.

ఎదురయ్యాయి. ఇంత జరిగినా ప్రవీణ విలాసాలకి, వినోదానికి అడ్డుపడలేదు.

ముసలి అత్తమామల నడుమ తన యవ్వనమెక్కడ బలైపోతుందోనని అనుమానించి ససేమిరా ఉండనంటూ ఆనంద్‌తో ఘర్షణ పడింది ప్రవీణ. తనకోసం అహోరాత్రులు కృషి చేసిన తల్లిదండ్రులను నడిసంద్రంలో వదిలెయ్యలేనన్నాడు ఆనంద్. అటు ప్రవీణను పాలించలేక, ఇటు కన్నవాళ్లను ఊరడించలేక మానసిక క్షోభకు గురయ్యాడు.

ఈ విషయంలో ప్రవీణ తల్లిదండ్రులు ఆనంద్‌తో ఏకీభవించలేదు.

అహంకారపు పొరలు కమ్మిన ప్రవీణ - కలిసి ఉండటం కష్టం అని ఖచ్చితంగా చెప్పేసరికి చేసేదిలేక ఎవరి దారి వారు చూసుకున్నారు.

000

"గుడ్ ఈవెనింగ్ మేడమ్!" అన్న సునంద్ పలకరింపుతో ఆ ప్రపంచం నుండి కల్లోల ప్రపంచంలోకి వచ్చేసింది ప్రవీణ.

"ఏమిటీ, ఇంత ఆలస్యం?" సుతారంగా అడిగింది ప్రవీణ.

"కారు కొంచెం ట్రబులిచ్చింది. పైగా వర్షం ..." అంటూ నసిగాడు సునంద్.

"హో...! వరండాలో నిలబెట్టి మాట్లాడుతున్నాను, కమ్ ఇన్‌సైడ్!" బెడ్‌రూమ్‌వైపు దారి తీసింది ప్రవీణ.

ఒణుకు పుట్టించే వాతావరణంలో, కాస్త వణుకుతూ ఆమెను అనుసరించాడు సునంద్.

ఆషాఢమాసమని సునంద్ భార్య కొత్త కాపరానికి రావడం లేటయింది. మరునాడు ఉదయాన్నే స్టేషన్‌కి వెళ్లి అర్ధాంగిని రిసీవ్ చేసుకోవాల్సి ఉన్నా, మేడమ్ ఆహ్వానాన్ని తిరస్కరించే సాహసం చేయలేక వచ్చాడు సునంద్.

నిగ్రహం ప్రదర్శిస్తూ "నీ భార్య కాపరానికి ఎప్పుడొస్తుంది?" ఆరా తీస్తున్నట్టు ప్రవీణ.

"టు... టు... టుమారో... రేపొద్దున్న!" కంగారుగా సమాధానం చెప్పాడు సునంద్.

"అయితే మీ ఫస్ట్ నైట్....?" అర్థోక్తిలో ఆగింది ప్రవీణ.

"లేదు, మేడమ్! మంచి రోజుకోసం .... ఇన్నాళ్లు ఆగింది. రేపు రాత్రికి ముహూర్తం నిర్ణయించారు పెద్దలు!" కొంచెం ఇబ్బందిగా చెప్పాడు సునంద్.

తొలకరి చినుకుకై వేచి ఉన్న భూమిలా ... రోజులన్నీ మూటకట్టుకుని తొలిరేయికై వేచి ఉన్న కొత్త పెళ్లి కూతురు ... సునంద్ భార్య... ఆమె మనసులో మెదిలింది. తన జీవితంలో గడిచిపోయిన ఆ మధురమైన రోజును మరోసారి జ్ఞప్తికి తెచ్చుకుంది. ఓ శాడిస్టిక్ చిరునవ్వు ఆమె పెదాలపై విషాదంగా భగ్గుమంది. తన భర్త ఆనంద్ తన స్వంతం ... మరెవ్వరితోనూ ఊహించలేను ... అనుకునేది అప్పట్లో, కానీ ఈ రోజు తీరు వేరు. సెంటిమెంట్ అంటేనే అసహ్యం వేసే స్థితికి చేరిన క్షణాలు అవి.

'ఓ... షిట్! అల్ ట్రాష్...! సిల్లీ సెంటిమెంట్స్!' అనుకుని, తను నమ్ముకున్న స్వసుఖ వాదమే గొప్పదని సమాధానపడింది ప్రవీణ.

000

నిశ్శబ్దాన్ని చీల్చే ప్రయత్నంలో "మేడమ్!" అంటూ మృదువుగా పిలిచాడు సునంద్.

"ఓ... ఐ యామ్ వెరీ సారీ!" అంటూ తేరుకున్న ప్రవీణ రెండు గ్లాసుల్లోకి విస్కీ పోసి,

"కమాన్, సునంద్! లెటజ్ హావ్ ఏ డ్రింక్!" గ్లాసు చేతికందించింది.

ఆమె వేలి కొసల తాకిడికి అతనిలో విద్యుచ్ఛక్తి ప్రవహించింది. యాథాలాపంగా అందుకున్న విస్కీ గ్లాసు షేక్ అయింది. సునంద్ శరీరంలో సన్నని ఒణుకు ప్రారంభమైంది. డ్రింక్స్ అలవాటు ఉన్నా, తనకన్నా పై స్థాయి వ్యక్తితో కలవడం.. కొంత నెర్వస్ కావడం ... అక్కడి వాతావరణంతో మరికొంత డిస్టర్బ్ అయ్యాడు.

మేడమ్ ఆఫర్‌ని కాదనలేక సతమతమవుతున్నాడు. విస్కీ గ్లాసు నోటికందించాడు. తెలియకుండానే గ్లాసులోని విస్కీ మొత్తం అతని గొంతులో ప్రవహిస్తోంది.

మరో గ్లాసు అందించింది ప్రవీణ. మళ్లీ అదే తంతు ...

సునంద్ గొంతుకలో సన్నని మంట ప్రారంభమైంది.

మూడో రౌండ్ తరువాత అతనిలో కాన్ఫిడెన్స్ లెవెల్ కొంచెం పెరిగింది. రిలాక్స్‌డ్‌గా కూర్చోగలిగాడు.

పెగ్గులు పెరిగినకొద్దీ అక్కడి వాతావరణం వేడెక్కుతోంది. మందు మహత్యంతో ఇద్దరిలో హుషారు పెరిగింది. మనసు ఎటో వెళ్లిపోయింది.

ఈజీ ఛెయిర్ నుండి లేచి ఒక్క అడుగు ముందుకేసింది ప్రవీణ. మైకంలో లోకమంతా మసకమసకగా కనిపిస్తోంది. ఒక మనిషి ఆకారం డాబాపైకి రావడం గమనించింది ... పోల్చుకోలేకపోతోంది ... మరో అడుగు ముందుకేసింది ... తడబాటుతో జారి పడుతున్న ప్రవీణకు ఆసరాగా నిలిచాడు సునంద్.

అతని భుజంపై తల వాల్చిన ప్రవీణ కనురెప్పలు భారంగా మూతపడుతున్నాయి. వచ్చిన ఆకారాన్ని పోల్చుకోలేకపోతోంది.

ఆ క్షణం గర్జన లేకుండా పిడుగులు కురిపించింది ఆకాశం.

000

అక్కడికి చేరుకున్న వ్యక్తి, ప్రవీణ మాజీ భర్త ఆనంద్! గుండెను సూదులతో ... ఎవరో గుండెలో గుచ్చిన భావన కలిగిందతనిలో.

'ఎలాగైనా సరే, మళ్లీ నీ సంసారం చక్కబడేట్టు చూడు బాబూ! ఆ పిల్లకు మొండితనం జాస్తి. నువ్వే కొంచెం సర్దుకుపో! ఓపికగా సర్దిచెబితే అమ్మాయి తప్పక ఒప్పుకుంటుంది. మా కా నమ్మకముంది...' తల్లిదండ్రుల హితబోధ ఎటునుంచో కర్ణకఠోరంగా వినబడుతోంది. హృదయభారాన్ని తగ్గించుకోవాలని అక్కడికొచ్చిన ఆనంద్ హృదయం వేయి ముక్కలైంది.

అతనిలో కసి పెరిగింది .... వాళ్లిద్దరినీ ఏదో చెయ్యాలన్న పిచ్చి కోపంలో రెచ్చిపోవాలనిపించింది.

ముసలి తల్లిదండ్రులు గుర్తుకొచ్చి, ఒక్క నిముషం తనను తాను తమాయించుకున్నాడు. తను ఇప్పుడు కేవలం ప్రవీణ మాజీ భర్త మాత్రమే. ఆమె జీవితంపై లా ప్రకారం అతనికెలాంటి హక్కూ లేదు. మనసు చెప్పిన కఠిన నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నాడు.

జీవితంలో పర్వతశిఖరాన్ని చేరుకున్నా, పాతాళానికి దిగజారినా ఆమె ఇష్టం! 'షి ఈజ్ ఎ ఫ్రీ బర్డ్ నౌ! కానీ ఒంటరిదైపోయిన ఆమె జీవితం మళ్లీ చిగురించే ఓ అందమైన అవకాశం చేజేతులా నాశనం చేసుకుందేమో...!

ఆనంద్‌ని గానీ, అతడి మానసిక స్థితినిగానీ సునంద్, ప్రవీణలు గమనించే స్థితిలో లేరు.

మానసిక సంఘర్షణకు గురైన ఆనంద్ భారంగా అడుగులు ముందుకేస్తున్నా అమ్మా నాన్నలకు ఇక్కడ జరిగిన విషయం ఎలా వివరించాలో అంతుచిక్కడంలేదు.

బాధపెట్టడంలోనూ వెరైటీ కనబరచిన ప్రవీణని తలుచుకుంటేనే భయమేస్తోంది అతడికి!

■

## పనులు కావాలంటే...

చాలామంది పై అధికారులు తమ కింధి వారికి ఆ పని చేయండి, ఈ పని చేయండని చెబుతూంటారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు పనులు చెప్పి, వా రా పనులు చేయకపోతే చిరాకు పడుతుంటారు.

పనులు చెప్పేవారిలో చాలామంది ఇతరులకు పనులు చెప్పి, వా రా పనులు పూర్తి చేయకపోతే బాధపడిపోవడమో, ఇరిటేట్ కావడమో చేస్తుంటారుతప్ప ఆ పనులు కావడం వలన సంస్థకుగాని, వ్యక్తికిగాని, కుటుంబానికిగాని జరిగే మంచి గురించి చెప్పేవారిలో స్ఫూర్తిని నింపడంలేదని అమెరికాలోని న్యూయార్క్ విశ్వవిద్యాలయం మానసిక నిపుణులు అంటున్నారు.

సి.